సాక్షి
శ్రీకాకుళం

సోమవారం । 17 । మార్చి । 2025



నేటి నుంచే ఇంటర్ స్పాట్

ఇంటర్ స్పాట్ నేటి నుంచి మొదలుకానుంది. ఏర్పాట్లు పూర్తి చేశారు.


- 8లో



అగ్నివీర్ అవుతారా..?

ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్‌లో మార్పులు జరిగాయి. 13 భాషల్లో ప్రవేశ పరీక్ష రాసే అవకాశం ఉంది.

- 8లో



ఇఫ్తార్	సహార్
సోమ (సా)	మంగళ (ఉ)
6.09	4.46

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయం



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, పార్టీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని ఆయన సేవలు మరువలేనివని వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. పొట్టి శ్రీరాములు 124వ జయంతి సందర్భంగా శ్రీకాకుళం కార్పొరేషన్ కార్యాలయానికి సమీపంలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా పొట్టి శ్రీరాములు నడుచుకున్నారని గుర్తు చేశారు. పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగానే ఈరోజు రాష్ట్రంలో అంతా హాయిగా ఉండగలిగామన్నారు. కార్యక్రమంలో కళింగకుల రాష్ట్ర అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు, రాష్ట్రకార్యదర్శి కేవీజీ సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, ఎస్సీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు ముంజేటి కృష్ణమూర్తి, చింతాడ వరుణ్, అంబటి శ్రీనివాసరావు, గొండు కృష్ణమూర్తి, ఎన్ని ధనుంజయరావు, మండవల్లి రవి, ఎం.ఏ బేగ్, సాదు వైకుంఠరావు, రౌతు శంకరరావు, గుండ హరీష్, పీస గోపి, కర్రి రంగాజీదేవ్, మూకళ్ల తాతబాబు, ఎండ రమేష్, సనపల నారాయణరావు, కోట గోవిందరావు, డాక్టర్ శ్రీనివాసపట్నాయక్, పొన్నాడ రుషి, తంగుడు నాగేశ్వరరావు, కర్నేనహరి, తారక్, వానపల్లి రమేష్, రావాడ జోగినాయుడు, త్రినాథరెడ్డి పాల్గొన్నారు.

ప్రమాద స్థలం పరిశీలన



పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఎచ్చెర్ల: లావేరు మండలం, బుడుమూరు గ్రామం వద్ద జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగిన స్థలాన్ని ఆదివారం ఉదయం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు.



తినుబండారం తెలుసుకో..

పిల్లాడు అన్నం తినడం లేదు.. వెంటనే ఓ చిప్స్ ప్యాకెట్ తాయిలమైపోతుంది.
పాప మారాం చేస్తోంది.. మరో ఎరుపురంగు ప్యాకెట్ తారకమంత్రంగా పనిచేస్తుంది.
బుజ్జాయి స్కూలుకు వెళ్తోంది.. ఆ బ్యాగ్‌లో పుస్తకాలు ఉన్నా లేకున్నా చిరుతిళ్ల ప్యాకెట్లు మాత్రం ఉండి తీరుతుంది.
చిన్నారి బడి నుంచి వచ్చాడు. ఇంట్లో వాళ్లను ఇబ్బంది పెట్టకుండా వీధి చివరి దుకాణంలో ఊరూపేరూ తెలియని రంగురంగుల ప్యాకెట్ వాడి నోరు మూయిస్తుంది.
ఏ పదార్థంతో తయారు చేశారు, ఎలా తయారు చేశారు, ఎప్పుడు తయారు చేశారో తెలీని 'ప్యాకెట్లు' చిన్నారుల పాలిట విషంగా మారుతున్నాయి. ఈ తిను 'బండారం' తెలుసుకోకుండా తల్లిదండ్రులు చేతులారా పిల్లల ఆరోగ్యాన్ని పాడు చేస్తున్నారు.



- పిల్లల ఆరోగ్యాన్ని హరిస్తున్న జంక్ ఫుడ్
- రంగురంగుల ప్యాకెట్ల వెనుక అపాయాలెన్నో
- తల్లిదండ్రులు అప్రమత్తం కావాలని వైద్యుల సూచన

పాతపట్నం:

జిల్లాలో ఏ షాపు చూసినా చిరుతిళ్ల ప్యాకెట్ల తోరణాలు కనిపిస్తూ కవ్విస్తుంటాయి. ఏ మాత్రం వాటి ఆకర్షణలో పడినా పిల్లలను ఆస్పత్రుల చుట్టూ తిప్పాల్సిందే. జంక్ ఫుడ్ పేరిట నానా రకాల పదార్థాలు పాన్‌షాపుల్లో దర్శనమిస్తున్నాయి. ఆకర్షణీయమైన రంగుల్లో ఆకట్టుకునే బొమ్మలతో పిల్లల నోరూరిస్తున్నాయి. కానీ ఇటువంటి చిరుతిళ్లు చిన్నారుల ఆరోగ్యానికి హానికరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇవి పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొంటున్నారు. చిన్నారుల ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్లక్ష్యం చేస్తే భారీమూల్యం తప్పదని చెబుతున్నారు.

ఒడిశా, పశ్చిమ బెంగాల్‌కు చెందిన రింగ్స్ చిప్స్ ప్యాకెట్లు ఎక్కువగా జిల్లాలోని దుకాణాల్లో కనిపిస్తున్నాయి. రింగ్స్, ట్రాప్స్ అనే రకాలకు చెందిన రింగ్స్ చిప్స్ ఒడిశా నుంచి వస్తున్నాయని, ట్రాయ్ రింగ్స్ అనే రకం పశ్చిమ బెంగాల్ నుంచి ఒడిశా మీదుగా వస్తున్నాయని దుకాణదారులు చెబుతున్నారు. ఎక్కువగా పాఠశాలలు ఉండే ప్రాంతాల్లో పాన్ షాపుల్లో రెండు, ఐదు రూపాయలకే ఈ చిరుతిళ్లు దొరుకుతుండడంతో.. అవి తినడం బాలలకు వ్యసనంగా మారిపోతోంది. ముప్పొద్దులా వీటినే తింటుండడంతో చాలా మంది ఉదర సంబంధిత సమస్యలతో బాధ పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రంగు రంగు ప్యాకెట్‌లు, నకిలీలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పాతపట్నంలో కిరాణా షాపుల్లో తోరణాలుగా రింగ్స్, చిప్స్ ప్యాకెట్లు

జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉంచాలి



పిల్లలను జంక్‌ఫుడ్స్‌కు దూరంగా ఉంచాలి. జంక్ ఫుడ్స్‌లో కెమికల్స్ ఉంటాయి. ఇవి తినడం వల్ల చిన్నారులకు ఊపిరితిత్తుల సమస్యలు, కడుపు నొప్పి, విరోచనాలు, ఆకలి మందగించడం వంటి సమస్యలు పిల్లలకు ఎక్కువగా వస్తుంటాయి. పాణిపూరి, చాక్లెట్లు, ఐస్ క్రీమ్‌లు, కూల్ డ్రింక్‌లకు పిల్లలను దూరంగా ఉంచాలి. - జి.వేణుగోపాల్, చిన్నపిల్లల వైద్యుడు, సీహెచ్‌సీ, పాతపట్నం

విద్యార్థులు చదువుకు దూరం



విద్యార్థులు పాఠశాలకు వచ్చే ముందు చిప్స్, రింగ్స్ ప్యాకెట్‌లు తినుకుంటూ వస్తుంటారు. పాఠశాలకు వచ్చి కడుపు నొప్పి, విరేచనాలు అంటూ మాకు చెబుతుంటారు. ఇంటికి విద్యార్థిని పంపిస్తుంటాము. మధ్యాహ్నం భోజనం కూడా పాఠశాలలో సరిగా తినడం లేదు. చిరుతిళ్లకు పిల్లలను దూరంగా ఉంచాలి. - పొడ్డిడి కృష్ణారావు,హెచ్‌ఎం, ఎంపీపీ మెయిన్ పాఠశాల, పాతపట్నం

టెన్‌షన్ లేదు

- నేటి నుంచే టెన్త్ పరీక్షలు
- గత ప్రభుత్వ నాడు–నేడు దయతో అన్ని సెంటర్లలో సకల సదుపాయాలు
- టెన్త్ క్లాస్ పరీక్షలకు జిల్లా స్పెషల్ ఆఫీసర్‌గా వీఎన్ మస్తానయ్య నియామకం



శ్రీకాకుళం న్యూకాలనీ: గత వైఎస్సార్ సీపీ హయాంలో చేపట్టిన నాడు–నేడు పనులు టెన్త్ విద్యార్థులకు అక్కరకు వస్తున్నాయి. సోమవారం నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానుండగా అన్ని సెంటర్లలోనూ సదుపాయాలు సిద్ధమయ్యాయి. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలు, వసతి కేంద్రాల్లో అదనపు భవనాలతోపాటు అత్యాధునిక ఫర్నీచర్, తాగునీటికి ఆర్వో ప్లాంట్, పటిష్టమైన విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, లైట్లు, అద్భుమైన మరుగుదొడ్లు, గ్రీన్ చాక్‌బోర్డులు, ఐఎఫ్‌పీ ప్యానెల్స్, రన్నింగ్ వాటర్‌కు చర్యలు ఇలా అన్ని వసతులు, సదుపాయాలను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కల్పించింది. ఇటీవల జరిగిన ఇంటర్ పరీక్షలను కూడా విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో రాశారు. దీంతో గత ప్రభుత్వ చొరవను ప్రతి ఒక్కరూ కొనియాడుతున్నారు. మాజీ సీఎం జగన్ దూరదృష్టిని మెచ్చుకుంటున్నారు. అయితే ఇప్పటికీ కొన్ని విద్యాసంస్థల్లో ఆఖరిదశలో నిలిచిపోయిన పనులకు కూటమి సర్కారు నిధులు విదల్చకపోతుండటం శోచనీయం.

నో సెల్‌ఫోన్ జోన్లుగా పరీక్ష కేంద్రాలు..

జిల్లాలో 149 కేంద్రాల్లో టెన్త్‌క్లాస్ పరీక్షలు మొదలు కానున్నాయి. 28,984 మంది పరీక్షలు రాస్తున్నారు. అలాగే నేటి నుంచి 8 కేంద్రాల్లో జరిగే ఓపెన్‌టెన్త్ పరీక్షలకు 807 మంది హాజరుకానున్నారు. కాగా టెన్త్ క్లాస్ పబ్లిక్ పరీక్ష కేంద్రాలను ప్రభుత్వం నో సెల్‌ఫోన్ జోన్లుగా ప్రకటించింది. విద్యార్థులతో పాటు సిబ్బంది కూడా సెల్‌ఫోన్లు కేంద్రం వెలుపలే ఉంచాలి. జిల్లాలో జరిగే టెన్త్‌క్లాస్ పరీక్షలకు పరిశీలకునిగా ఏపీఆర్‌ఈఐఎస్ డైరెక్టర్ వీఎన్ మస్తానయ్యను ప్రభుత్వం నియమించింది. ఆదివారం జిల్లాకు చేరుకున్న ఆయన డీఈఓ డాక్టర్ తిరుమల చైతన్య తదితర అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు.



ప్రభుత్వ పాఠశాలలో తొణికిసలాడుతున్న అత్యాధునిక ఫర్నీచర్

నేడు మదీనా దర్గా చందనోత్సవం



విద్యుత్ కాంతులతో మదీనా దర్గా

గార: కళింగపట్నం పరిధి నగరాలపేట వద్దనున్న కళింగ హజరత్ మదీనా బాబా దర్గా వద్ద సోమవారం ఉరుసు చందనోత్సవం జరగనుంది. ముందు బాబా సమాధి వద్ద అభిషేకాలను నిర్వహిస్తారు. అనంతరం గత ఏడాది సమాధిపై వేసిన చందనం పూతను తొలగిస్తారు. ఎదురుగా ఉన్న ప్రార్థనా స్థలం వద్ద ముస్లిం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేసిన తర్వాతే భక్తులకు దర్శనం ఉంటుంది. ఇక్కడ ప్రతి గురువారం హిందూ, ముస్లిం భక్తులు పాల్గొని పూజలు చేస్తారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి ప్రారంభం కానున్న ఉత్సవంలో సాయంత్రం బాబా సమాధిని కప్పి ఉంచే ప్రధానమైన వస్త్రాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి సమాధిపై ఉంచుతారు.

పలాసలో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ పర్యటన నేడు

శ్రీకాకుళం అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు పలాస, కాశీబుగ్గ, మందస, సమీప మండల కేంద్రాల్లో సోమ, మంగళవారాలు పర్యటించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ కార్యదర్శి ఎన్.పద్మజ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కేజీబీవీలు సందర్శిస్తారని ప్రకటనలో పేర్కొన్నారు.

మరోచోట దంపతులకు ప్రమాదం

బూర్జ: మండలంలోని శ్రీకాకుళం–పాలకొండ ప్రధాన రహదారిలో కొరగాం గ్రామ మలుపు వద్ద ఆదివారం ఉదయం టిప్పరు–మోటారు బైక్ ఢీ కొని దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక పోలీసులు తెలియజేసిన వివరాలు ప్రకారం.. మండలంలోని ఏబీసీ పేటకు చెందిన భుగత చంద్రశేఖర్, భార్య భాగ్యలక్ష్మి కలసి శ్రీకాకుళం నుంచి స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా పాలకొండ నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న టిప్పర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో భార్యాభర్తలకు తీవ్ర గాయాలై అపస్మార స్థితికి వెళ్లిపోయారు.స్థానికులు గమనించి 108 వాహన సిబ్బంది సాయంతో శ్రీకాకుళం ప్రభుత్వ రిమ్స్‌కు తరలించారు. అక్కడి నుంచి మరో ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. చంద్రశేఖర్ సోదరుడు భుగత మల్లేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్‌ఐ ఎం.ప్రవల్లిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మండుతున్న ఎండల్లో మృత్యుదేవత రహదారుల వెంబడే తిరుగాడుతోంది. వేడి ధాటికి రోడ్డుపై తారు మరుగుతుంటే.. దూసుకొస్తున్న వాహనాలను బోల్తా కొట్టిస్తోంది. టైరు ఏ మాత్రం పాతదైనా, నాణ్యత కొద్దిగా తగ్గినా బండి బోల్తా కొట్టక తప్పదు. అందుకే వేసవిలో వాహనాల టైర్లు మరోసారి చూసుకోవడం శ్రేయస్కరం. బాగులేకపోతే మార్చుకోవడం, క్రమం తప్పకుండా తనిఖీ చేయించుకోవడం, నైట్రోజన్‌తో గాలి నింపుకోవడం తారక మంత్రాలుగా గుర్తుంచుకోవాని నిపుణులు సూచిస్తున్నారు. - శ్రీకాకుళం క్రైమ్, టెక్కలి, కంచిలి

చోదకా.. నీకే హెచ్చరిక

- వాహనాల్లో టైర్ల సంరక్షణే కీలకం
- తరచూ తనిఖీ చేయించుకోవాలంటున్న నిపుణులు
- నైట్రోజన్ ఎయిర్ తప్పనిసరి
- ఐఎస్‌ఐ మార్కు ట్యూబ్‌లెస్ టైర్ బెటర్



జిల్లాలో వాహన ప్రమాదాలు పెరుగుతున్నాయి. అతివేగం ఓ కారణమైతే నాణ్యత లేని టైర్లు మరో కారణంగా తెలుస్తోంది. ప్రస్తుతం వేసవిలో ఇలాంటి ప్రమాదాలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలకే ప్రమాదం అని చెబుతున్నారు. జిల్లాలో ఇటీవల జరిగిన ప్రమాదాలు పరిశీలిస్తే టైర్లు పేలడం, పంక్చర్ అవ్వడం కొన్ని స్కిడ్ అవ్వడం కనిపించాయి.

సూచనలు ఇవే..



- వేసవి వేడి పెరిగిన కారణంగా రహదారి బాగా వేడెక్కి కొత్త టైర్లు సైతం పేలే అవకాశాలున్నాయి. కారులో నైట్రోజన్ ఎయిర్ తప్పనిసరిగా ఉండేలా చూడాలి. ఇది రన్నింగ్‌లో టైర్లను కూల్ చేస్తుంది.
- ప్రయాణానికి ముందు టైర్లలో ఎంత ఎయిర్ ప్రెజర్ ఉందన్నదీ తనిఖీ చేసుకోవాలి. కారు మోడల్‌ను బట్టి ఫ్రంట్ సైడ్ డోర్‌లో వివరాలుంటాయి. సాధారణంగా అయితే ఫ్రంట్ టైర్లలో 35–40, బ్యాక్ టైర్లలో 30 వరకు ఎయిర్ ప్రెజర్ ఉంటుంది.
- తరచూ వీల్ ఎలైన్‌మెంట్ కరెక్టుగా ఉందా.. స్టీరింగ్ బాక్స్ కరెక్టుగా ఉందా లేదన్నదీ తనిఖీ చేసుకోవాలి.
- ఐఎస్‌ఐ మార్క్ ఉన్న ట్యూబ్‌లెస్ టైర్లు ఉంటే బెటర్.. చైనా వీల్స్ వాడకపోతేనే మంచిది. రీబటన్ టైర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ వద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు.
- కారుల్లో సీటు బెల్టు ముందున్న వారితో పాటు వెనుక కూర్చున్న వారు కూడా పెట్టుకోవాలి. లాంగ్ జర్నీ చేసేటప్పుడు ఆరు గంటలకు మించి కంటిన్యూ చేయరాదు.
- స్కూళ్లు, కళాశాలల్లో ఇప్పటికీ పాతరకం బస్సులు నడుపుతుండటం ఈ వేసవిలో అంత శ్రేయస్కరం కాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.


కొన్ని ప్రమాదాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు


- లావేరు మండలం బుడుమూరు హైవే సమీపంలో కారు బోల్తా కొట్టి నలుగురు ప్రాణాలు కోల్పోయారు.
- గత ఏడాది డిసెంబరు 18న కోటబొమ్మాళి మండలం పాకివలస సమీప జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి సెంటర్ డివైడర్‌పై నుంచి అవతలిరోడ్డు వైపునకు వెళ్లి స్కూటీపై వస్తున్న టీచర్‌ను ఢీకొట్టింది.
- అంతకు కొద్ది నెలల ముందు ఇదే మండలం శ్రీపురం సంత సమీప హైవే వద్ద అతివేగంతో వచ్చిన కారు అదుపు తప్పి ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు.
- గత ఏడాది డిసెంబరు 24న కంచిలి పెద్దకొజ్జిరియా– చిన్నకొజ్జిరియా సమీప హైవే వద్ద అతివేగంతో వచ్చిన కారు స్కిడ్ అవ్వడంతో రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్తు స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి.
- గత ఏడాది నవంబరు 30న విజయనగరం జిల్లా భోగాపురం వద్ద హైవేపై మితిమీరిన వేగంతో వెళ్తున్న కారు అదుపు తప్పి డివైడర్ ఎక్కి ఆవలి రోడ్డువైపునకు వెళ్లి లారీని ఢీకొనడంతో నలుగురు జిల్లావాసులు మృతిచెందారు.
- ఈ ఘటనలు పరిశీలిస్తే ప్రమాదానికి ముందు, తర్వాత టైర్లు పేలడం కనిపించింది.

నిబంధనలు పాటించాలి




రహదారి భద్రతా నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలి. కార్లలో ప్రయాణించే వారు అధికంగా కుటుంబీకులే ఉంటారు. నెమ్మదిగా నడిపి సురక్షితంగా గమ్యాన్ని చేరాలి. హైవే పెట్రోలింగ్ సిబ్బంది నోపార్కింగ్ ఏరియాల్లో బళ్లు నిలపకుండా చూడాలి. - కేవీ మహేశ్వరరెడ్డి, ఎస్పీ, శ్రీకాకుళం

ముందుగానే టైర్లు మార్చుకుంటాను..



నా ఫార్చ్యూనర్ వాహనానికి ఒకే సారి టైర్లు వేయిస్తాను. కాల పరిమితికి ముందుగానే వాటిని మార్చివేస్తాను. ప్రతి రోజూ టైర్ల పరిస్థితి ఏ విధంగా ఉన్నాయో పరిశీలించమని డ్రైవర్‌కు చెబుతాను. వాహనానికి టైర్లు సక్రమంగా ఉంటేనే ఎలాంటి ప్రమాదాలు జరగవు. - ఎస్.మోహన్‌రావు, ఫార్చ్యూనర్ వాహనం యజమాని, టెక్కలి

గాలి చూసుకోవాలి



వాహనాన్ని నడిపే ముందు ఎప్పటికప్పుడు తప్పనిసరిగా టైర్లలో గాలి చూసుకోవాలి. ఇటీవల జరిగిన ప్రమాదాల్లో టైర్లు పేలి తీవ్ర ప్రమాదాలకు దారి తీయడం మనం చూస్తున్నాం. ప్రస్తుతం మధ్య తరగతి కుటుంబాలు ఎక్కువ శాతం కార్లను కొనుగోలు చేస్తున్నారు. వారంతా ఈ విషయాల్ని తప్పనిసరిగా పాటించాలి. - ఇప్పిలి ప్రవీణ్‌కుమార్, కంచిలి



సారవకోట: సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాసరావు

మరో కుటుంబంలో 'కారు' చీకటి కమ్ముకుంది. అతివేగం ఇంకో ఇద్దరి ఆయుష్షు రేఖను కుదించేసింది. కొత్తగా రూపుదిద్దుకున్న హైవే రెండు ప్రాణాలను బలి తీసుకుంది. కడదాకా కలిసుందామని బాసలు చేసుకున్న దంపతులకు ఇదే ఆఖరి ప్రయాణమైంది. కాలం ఎంత కర్కశమైందంటే.. అమ్మానాన్న చనిపోతే ఆ విషయం అదే వాహనంలో ఉన్న బిడ్డకు తెలియరాలేదు.

ఆఖరి ప్రయాణం

- రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి
- సారవకోట మండలం కురిడింగి సమీపంలో ఘటన



చికిత్స పొందుతున్న కీర్తి విహార్

సారవకోట, పాతపట్నం:

సారవకోట మండలంలోని చిన్నకిట్టాలపాడు పంచాయతీ కురిడింగి గ్రామ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాతపట్నం శ్రీరామ్‌నగర్‌కు చెందిన పెద్దగోపు వెంకటప్రసాద్(56), ఆయన భార్య పెద్దగోపు వాణి(45) అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు, స్థానికులు, లారీ డ్రైవర్ తెలిపిన వివరాల ప్రకారం..

పాతపట్నం శ్రీరామ్‌నగర్‌కు చెందిన పెద్దగోపు వెంకటప్రసాద్ ఆయన భార్య వాణి, కుమారుడు కీర్తి విహార్ ఒడిశాలోని పర్లాకిమిడి రాజవీధికి చెందిన తులగ హేమలత, ఇంజు చక్రవర్తిలు కలిసి ఆదివారం ఉదయం కారులో శ్రీకాకుళంలో వివాహానికి హాజరయ్యారు. పెళ్లికి హాజరై తిరుగు ప్రయాణంలో సారవకోట మండలం కురిడింగి గ్రామ సమీపానికి వస్తుండగా.. సరిగ్గా మధ్యాహ్నం 3.35 గంటల సమయంలో ఎదురుగా వస్తున్న లారీని వీరి కారు ఢీకొట్టింది. ఆ దెబ్బకు లారీ ముందు యాక్సిల్ విరిగిపోయి ముందు చక్రం డీజిల్ ట్యాంకుకు ఢీకొట్టింది. ఆ ధాటికి కారు డ్రైవింగ్ చేస్తున్న వెంకటప్రసాద్, వెనుక సీట్లో కూర్చున్న భార్య వాణి తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్‌కు పక్క సీట్లో కూర్చున్న ఇంజు చక్రవర్తికు, వెనుక సీట్లో కూర్చున్న కీర్తి విహార్‌కు, తులగ హేమలతకు తీవ్రగాయాలయ్యాయి. ఘటన జరిగిన వెంటనే స్థానికులు స్పందించి హైవే అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వారు వచ్చి క్షతగాత్రులను పాతపట్నం సీహెచ్‌కు తరలించారు. అనంతరం శ్రీకాకుళం తీసుకెళ్లారు.

అయ్యో ఆ కుటుంబం..

ప్రమాదంలో చనిపోయిన వెంకటప్రసాద్(56) వాణి(45) దంపతులది పర్లాకిమిడిలోని రాజవీధి. వెంకటప్రసాద్ అమరావతి ట్రావెల్స్ బస్సులకు భాగస్వామి. గత ఎనిమిదేళ్లుగా పాతపట్నంలో నివాసం ఉంటున్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు విశాల్ అమెరికాలో జాబ్ చేస్తున్నాడు. రెండో కుమారుడైన కీర్తి విహార్ ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఇతను భువనేశ్వర్‌లో బీటెక్ చేస్తున్నాడు. ప్రమాదంలో అతడు తీవ్రంగా గాయపడడంతో తల్లిదండ్రులు చనిపోయిన విషయం కూడా చాలా సేపటి వరకు తెలియలేదు.



పెద్దగోపు వెంకటప్రసాద్, వాణి దంపతులు (ఫైల్)

అతివేగమే కారణమా..?

- కారు లారీని ఢీకొన్న ధాటికి కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జైపోయింది. కారు భాగాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. ఎయిర్ బెలూన్స్ ఓపెన్ అయి పాడైపోయాయి.
- లారీ ముందు భాగం యాక్సిల్ విరిగిపోయి డీజిల్ ట్యాంకును సైతం ఢీ కొనడంతో డీజిల్ పూర్తిగా కారిపోయింది.
- ప్రమాదం జరిగిన స్థలంలో ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో లారీ డ్రైవర్, బైక్‌పై అటుగా వస్తున్న పెద్దలంబకు చెందిన శ్రీను, బొంతుకు చెందిన జయరామ్, స్థానికుల సాయంతో కారు డోర్‌ను గునపాలతో పొడిచి తీశారు.
- సంఘటన స్థలాన్ని నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు, సారవకోట ఎస్‌ఐ అనిల్ కుమార్ పరిశీలించారు. మృతదేహాలను పాతపట్నం సీహెచ్‌సీకు తరలించారు.



నుజ్జయిన లారీ ముందు భాగం

ఆదివారం కాకపోయి ఉంటే..

కురిడింగి ప్రాథమిక పాఠశాల ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదం స్థానికులను భయభ్రాంతులకు గురి చేసింది. పాఠశాల విడిచిపెట్టే సమయం, ప్రమాదం జరిగిన సమయం ఒకటే కావడం గమనార్హం. ఆదివారం ప్రమాదం జరగడంతో పిల్లలు రోడ్డు మీదకు రాలేదని, లేదంటే మరింత ఘోరం జరిగి ఉండేదని స్థానికులు చెబుతున్నారు. ఇక్కడ సర్వీస్ రోడ్డు లేక పోవడం, హైవే సిబ్బంది పాఠశాల జోన్ అని కనిపించేలా బోర్డులు ఏర్పాటు చేయకపోవడంపై స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి


రిమ్స్‌లో వ్యక్తి మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు తెలిపారు. ఈ నెల 13న ఉదయం 11.15 గంటలకు ఆర్టీసీ కాంప్లెక్సు సమీప జడ్జి బంగ్లా ఎదురుగా మురుగు కాలువలో బోర్లా పడివున్న వ్యక్తిని చూసి సమీప ఆటో డ్రైవర్లు బయకు తీసి చికిత్స నిమిత్తం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చేర్పించగా మృతిచెందాడు. వివరాలు తెలిసిన వారు 6309990824, 6309990843 నంబర్లకు తెలియజేయాలని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

'కులం పేరిట బెదిరిస్తున్నారు'

టెక్కలి: తనను కులం కార్డుతో బెదిరిస్తూ పోలీసులతో భయపెడుతున్నారని, వీటి నుంచి రక్షణ కల్పించాలని టెక్కలి మండలం పెద్ద సాన ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.నేతాజీ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందులో కొంత మంది పేర్లను ప్రస్తావిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైన క్రమంలో గ్రామంలో ఎటువంటి పరిణామాలు చోటు చేసుకుంటాయోననే ఆందోళన చోటు చేసుకుంటోంది. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించి సమస్యను కొలిక్కి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆన్‌లైన్‌లోనే ఐపీఎల్ టికెట్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: బీసీసీఐ నిర్వహిస్తున్న ఐపీఎల్ టోర్నీకి సంబంధించి విశాఖపట్నంలో జరిగే రెండు మ్యాచ్‌లకు అభిమానులు ఆన్‌లైన్‌లో మాత్రమే టికెట్లు బుక్ చేసుకోవాలని జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పీవైఎస్ శాస్త్రి, హసన్‌రాజా, మెంటార్ ఇలియాస్ అహ్మద్, కోశాధికారి మదినా శైలానీ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖపట్నం మధురవాడలోని ఏసీఏ - వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని ఢిల్లీ క్యాపిటల్స్ తన రెండో క్రికెట్ మైదానంగా ఎంపిక చేసుకుందని చెప్పారు. ఈ నెల 24న సాయంత్రం 7.30 గంటలకు లక్నో సూపర్‌జెయింట్స్‌తో, 30న మధ్యాహ్నం 3.30 గంటలకు సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ఢిల్లీ క్యాపిటల్స్ తలపడనుందని పేర్కొన్నారు. ఈ మ్యాచ్‌లకు ఏసీఏతో ఢిల్లీ క్యాపిటల్స్ అద్దె ప్రాతిపదికన ఒప్పందం చేసుకోవడంతో మ్యాచ్‌లకు సంబంధించి ఎలాంటి టికెట్లు ఏసీఏ జిల్లా క్రికెట్ సంఘానికి సమకూర్చడంలేదని వారు స్పష్టంచేశారు. ఆసక్తి కలిగిన వారు డిస్ట్రిక్ట్ యాప్‌లో టికెట్లు కొనుగోలు చేసుకోవాలని సూచించారు.

ట్రెజరీ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక


సంఘం నూతన కార్యవర్గం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ, అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా శాఖ ఎన్నికలు ఆదివారం జిల్లా ఖజానా శాఖ కార్యాలయంలో ఏకగ్రీవంగా జరిగాయి. ఎన్నికల అధికారిగా నాజర్‌బాగ్ వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా పైడి వెంకటరమణ, అసోసియేట్ అధ్యక్షుడిగా పొలుగుమటి గంగరాజు, ఉపాధ్యక్షులుగా మీసాల రమేష్‌నాయుడు, పేరాడ మన్మధరావు, మహిళా ఉపాధ్యక్షురాలిగా ఎం.షల్మ, కార్యదర్శిగా పుప్పాల శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బోర శ్రీధర్, జాయింట్ సెక్రటరీలుగా చిట్టి చంద్రశేఖర్, పూలి సింహాద్రిరాజు, మహిళా కార్యదర్శిగా మామిడి మీనాక్షి, ట్రెజరర్‌గా సలాడి సూర్యచంద్ర ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఖజానా ఉద్యోగులు బెండి మోహనరావు, సత్యనారాయణ తదితరులు అభినందించారు.

పది కేజీల వెండి చోరీ

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని శివాజీనగర్‌లో పాడి చంద్రశేఖరరావు ఇంట్లో దొంగలు చొరబడి పది కేజీల వెండి ఆభరణాలు అపహరించుకుపోయారు. స్వగ్రామం నందిగాం మండలం జడ్యాడ గ్రామానికి సంబరం నిమిత్తం ఈ నెల 14న వెళ్లి తిరిగి 15వ తేదీన ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళాలు పగలుకొట్టి కనిపించాయని, లోపలికి వెళ్లి చూడగా కెండి కంచం, అష్టలక్ష్మి చెంబులు, చిన్నచెంబులు, వెండి దీపం కద్దులు, వెండి ప్లేటలు, పంచపాత్రి, వెండికప్పులు, బరినెలు, గిన్నెలు, పట్టీలు మాయమయ్యాయని బాధిత కుటుంబ సభ్యులు వాపోయారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఘనంగా తెరవే సాహితీ సమ్మేళనం

శ్రీకాకుళం కల్చరల్: తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో 102వ నెల సాహితీ సమ్మేళనం నగరంలోని శాంతినికేతన్ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. సంస్థ అధ్యక్ష కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి నిర్వహణలో సంస్థ సభ్యులు కవులు, రచయితలు సామాజిక పరమైన కవితలను, పద్యాలను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఇద్ది పాపయ్య, పి.వి.దుర్గాప్రసాద్, కుప్పిలి త్రినాథరావు, తంగి ఎర్రమ్మ, ఐఎస్‌డీ ప్రసాద్, ఎల్.సత్యానందం, వి.రాజారావు, తోట గోపాలరావు, డాక్టర్ కోమలరావు, బి.మోహన్‌గాంధీ, కె.బి.రవికిరణ్, కిల్లాన శ్రీనివాస్, బి.జగన్నాథరావు పాల్గొన్నారు.

నేటి నుంచే
ఇంటర్ స్పాట్


ముందే చేరుకున్న సంస్కృతం పేపర్లను మూల్యాంకనం చేస్తున్న ఎగ్జామినర్లు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల వేదికగా మూల్యాంకనం
- సీసీ కెమెరాలతో పర్యవేక్షణ


స్పాట్ కేంద్రంలో ఆర్ఐఓ దుర్గారావు, జనరల్-1 వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం న్యూకాలనీ:

జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన జవాబుపత్రాల మూల్యాంకనం (స్పాట్ వాల్యుయేషన్)కు సర్వం సిద్ధమైంది. శ్రీకాకుళం ప్రభుత్వ (బాలుర) జూనియర్ కళాశాల కేంద్రంగా సోమవారం నుంచి ప్రారంభంకానున్న ఈ ప్రక్రియకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. నాలుగు విడతల్లో జరిగే స్పాట్‌లో మొదటి విడతగా తెలుగు, హిందీ, ఇంగ్లీషు, గణితం, సివిక్స్ పేపర్లను దిద్దనున్నారు. ఇప్పటికే సంస్కృతం పేపర్ వాల్యుయేషన్ మొదలైంది. గత ప్రభుత్వం 'మనబడి నాడు-నేడు' కార్యక్రమం కింద శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు అన్ని సౌకర్యాలు, వసతులు కల్పించింది. సరికొత్త ఫర్నిచర్, ఫ్యాన్లు, లైటింగ్, మరుగుదొడ్లు ఇలా అన్ని వసతులు, సౌకర్యాలు అందుబాటులో ఉండటంతో అధికారులు సైతం ప్రశాంతంగా ఉన్నారు. కాగా స్పాట్‌కు హాజరయ్యేవారు సమయపాలన పాటించాలని, అప్రమత్తంగా ఉండాలని, దిద్దుబాటులో జరిగే తప్పులు, దోషాలకు మూల్యం చెల్లించుకోకతప్పదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. సీసీ కెమెరాలను అమర్చి, ఆన్‌లైన్ స్ట్రీమింగ్ చేశారు.

స్పెల్	మొదలయ్యే తేది	దిద్దనున్న సబ్జెక్టులు
1వ స్పెల్	మార్చి 17నుంచి	తెలుగు, హిందీ, ఇంగ్లీషు, మాథ్స్, సివిక్స్
2వ స్పెల్	మార్చి 22 నుంచి	ఫిజిక్స్, ఎకనామిక్స్, జీఎఫ్‌సి
3వ స్పెల్	మార్చి 24 నుంచి	కెమిస్ట్రీ, హిస్టరీ
4వ స్పెల్	మార్చి 26 నుంచి	కామర్స్, బోటనీ, జువాలజీ, బ్రిడ్జ్ కోర్సులు

సీసీ కెమెరాల పర్యవేక్షణలో..



జిల్లాలో సోమవారం నుంచి ప్రారంభంకానున్న ఇంటర్మీడియట్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. సిబ్బంది నియామకం పూర్తయింది. స్పెల్స్‌ను బట్టి విధులకు హాజరు కావాల్సి ఉంటుంది. సమయపాలన పాటించాలి. సెల్‌ఫోన్‌లకు అనుమతిలేదు. సీసీకెమెరాలను అమర్చి, స్ట్రీమింగ్ చేయిస్తున్నాం. బోర్డు ఉన్నతాధికారులు కూడా పర్యవేక్షిస్తారు. – ప్రగడ దుర్గారావు, ఆర్ఐఓ/ఇంటర్ స్పాట్ క్యాంప్ ఆఫీసర్ శ్రీకాకుళం

నియామకాలు పూర్తి..

స్పాట్ వాల్యుయేషన్‌లో అన్ని సబ్జెక్టులకు కలిపి మూల్యాంకనంలో మొత్తం 1200 మం యంత్రాంగం/సిబ్బందిని నియమించారు. క్యాంప్ ఆఫీసర్‌గా ఆర్ఐఓ ప్రగడ దుర్గారావు వ్యవహరిస్తున్నారు. ఏసీవో జనరల్-1 గణపతి వెంకటేశ్వరరావు (ఇన్‌చార్జి ప్రిన్సిపాల్- జీజేసీ శ్రీకాకుళం బాలురు), జనరల్-2గా (ఫిజిక్స్ జేఎల్-శ్రీకాకుళం బాలురు)తోపాటు సీసీవోలు, కోడింగ్ ఆఫీసర్లు, ఏసీవోలు, చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు, స్క్రూటినైజర్లు నియామక ప్రక్రియ పూర్తయ్యింది. స్పాట్ ఆర్డర్ నియామక ఉత్తర్వులు ఆయా కాలేజీల బీఐఈఏపీ లాగిన్‌లో డౌన్‌లోడింగ్‌కు అందుబాటులో ఉన్నాయి.

జిల్లాకు చేరిన పేపర్లు..

శ్రీకాకుళం జిల్లాకు 2.45 లక్షల జవాబుపత్రాలు చేరుకోనున్నాయి. ఇప్పటి వరకు 2లక్షల జవాబుపత్రాలు చేరాయి. ఇందులో ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 13 ప్రధాన సబ్జెక్టుల జవాబుపత్రాలు ఉన్నాయి. ఎగ్జామినర్ పూటకు 15 చొప్పున రోజుకు 30 పేపర్లు దిద్దాల్సి ఉంటుంది. పేపర్(స్క్రిప్ట్)కు రూ.23.66 పైసలు చెల్లిస్తారు. ఈ లెక్కన రోజుకు రూ. 709.66లు చెల్లించనున్నారు. వీటితో పాటు టీఏ, డీఏ, లోకల్ కన్వేయిన్స్/అవుట్‌స్టేషన్ అలవెన్స్ ఇలా చెల్లించే మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయనున్నారు.

సముద్రమార్గ ఉగ్ర చర్యలను అరికడతాం


హాజరైన అధికారులు


మాట్లాడుతున్న కమాండెంట్ సతీష్‌కుమార్

శ్రీకాకుళం క్రైమ్ : సముద్రమార్గం గుండా ఉగ్రవాదులు భారతదేశంలో ప్రవేశించకుంటా అడ్డుకుంటామని, మాదకద్రవ్యాల అక్రమ రవాణా అరికడతామని, ఆ దిశగా తీర ప్రాంత ప్రజలను అవగాహనపర్చడమే లక్ష్యంగా సీఐఎస్ఎఫ్ (సెంట్రల్ ఇండస్ట్రీస్ సెక్యూరిటీ ఫోర్స్) సైకిల్ ర్యాలీని కోల్‌కతా నుంచి కన్యాకుమారి వరకు చేపడుతున్నట్లు విశాఖ పోర్టు ట్రస్టు కమాండెంట్ సతీష్‌కుమార్ బాజ్‌పాయ్ అన్నారు. 6553 కిలోమీటర్ల లక్ష్యంగా మొదలైన సీఐఎస్ఎఫ్ ర్యాలీ(50 మందితో) ఆదివారం శ్రీకాకుళం కొత్త రోడ్డు జంక్షన్ వద్దకు చేరుకుంది. అనంతరం స్థానిక గోపి డ్యాన్స్ అకాడమీ నుంచి ఆర్మీ థీమ్, దేశ భక్తి గీతాలు ప్రదర్శన రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ ఇప్పటివరకు 1100 కిలోమీటర్లు ప్రయాణించారని మార్చి 31 కల్లా కన్యాకుమారి చేరుకుంటారని చెప్పారు. గతంలో సముద్రమార్గం గుండానే ఉగ్రవాదులు భారత్‌లో చొరబడి పార్లమెంటుపై దాడిచేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సోమవారం ఉదయం 6.30 గంటలకు బయల్దేరి విశాఖపట్నం సాయంత్రం 5 గంటలకు చేరుతామన్నారు. కార్యక్రమంలో ఎస్టీపీసీ డిప్యూటీ కమాండెంట్ వినీత్‌కుమార్ ప్రభాకర్, విశాఖ స్టీల్‌ప్లాంట్ సీనియర్ కమాండెంట్ ఏఎం హనీఫ్, అసిస్టెంట్ కమాండెంట్లు జి.శ్రీనివాస్, శ్రీకర్ లోహియా, మాజీ సైనికులు కటకం పూర్ణచంద్రరావు, వీరనారీలు అమ్మన్నమ్మ, వంజరాపు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తాటిపూడి వద్ద 200 ఎకరాల్లో భూమాత సరికొత్త వెంచర్


వేదికపై బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఎండీ తాళ్లూరి పూర్ణచంద్రరావు తదితరులు

కొమ్మాది :

భూమాత గ్రూప్, ఎస్‌వీఎస్ గ్రూప్ సంయుక్తంగా తాటిపూడి వద్ద 200 ఎకరాల్లో భూమాతాస్ ఎస్‌వీఎస్ స్వప్నలోక్ పేరుతో వెంచర్ వేస్తున్నట్లు భూమాత గ్రూప్ ఎండీ తాళ్లూరి పూర్ణచంద్రరావు తెలిపారు. బీచ్‌రోడ్డులోని ఓ రిసార్ట్‌లో ఆదివారం దీనికి సంబంధించిన బ్రోచర్‌ను ఎస్‌విఎస్ ప్రతినిధులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 200 ఎకరాల్లో 5 ఫేజ్‌ల్లో.. 1650 ఫ్లాట్లు వీఎంఆర్‌డీఏ అనుమతులతో అందరికి అందుబాటు ధరల్లో నిర్మించినట్లు తెలిపారు. ఈ వెంచర్‌లో ఇంతవరకు రియల్‌ఎస్టేట్ చరిత్రలో ఎవరు ఇవ్వని సౌకర్యాలు, క్లబ్ హౌస్, స్విమ్మింగ్ పూల్ సదుపాయాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. థీమ్డ్ ప్రీమియం రెసిడెన్షియల్ మెగా ప్రాజెక్టుగా కస్టమర్లకు విశ్రాంతి, వినోదం ఇచ్చే ఇలాంటి భారీ రెసిడెన్షియల్ ప్రాజెక్టు ఆంధ్రలో ఇదే మొదటిదని తెలిపారు. ఈ వెంచర్‌కు సమీపంలోని తాటిపూడి రిజర్వాయర్‌ను ప్రభుత్వం టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేస్తుండడంతోపాటు 500 ఎకరాల్లో జిందాల్ కంపెనీ టూరిస్ట్ స్పాట్‌గా చేయడానికి రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నారని పేర్కొన్నారు. వెంచర్ మీదుగా 4 లైన్ల హైవే పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ తాళ్లూరి శివాజీ, కిరణ్ శంకర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని జంతువు సంచారం


పాదముద్రలు తనిఖీ చేస్తున్న అటవీ శాఖ సిబ్బంది

గార: మండలంలోని శాలిహుండం పంచాయతీ పరిధి గ్రామాల్లో గుర్తు తెలియని జంతువు సంచరిస్తున్నట్లు సమాచారం అందిందని నియోజకవర్గ అటవీ అధికారి ఎం.నిహారిక ఆదివారం తెలిపారు. వంట పొలాల్లో గుర్తుతెలియని జంతువు పాదముద్రలు కనిపిస్తే సమాచారమివ్వాలన్నారు. ఇప్పటికే అటవీ సిబ్బంది అప్పోజీపేట, తంగుళ్లపేట తదితర గ్రామాల్లో పర్యటించి ఆరా తీశారని పేర్కొన్నారు. అనుమానాస్పద స్థితిలో పాదముద్రలు కనిపిస్తే అటవీ సిబ్బంది 90224 74448 నంబర్‌కు సమాచారమివ్వాలని కోరారు.

అగ్నివీర్ అవుతారా?



- ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్‌లో భారీ మార్పులు
- 13 భాషల్లో ప్రవేశ పరీక్ష రాసే అవకాశం
- ఎన్‌సీసీ, ఐటీఐ, పాలిటెక్నిక్ డిప్లమో అభ్యర్థులకు బోనస్ మార్కులు
- విశాఖలో మరోసారి ర్యాలీ
- ఏప్రిల్ 10 వరకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం

సాక్షి, విశాఖపట్నం:

దేశ రక్షణ కోసం సైన్యంలో చేరాలనుకునే యువతకు తీపికబురు. అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. రిక్రూట్‌మెంట్ చరిత్రలో తొలిసారిగా ప్రవేశ పరీక్షను ఏకంగా 13 ప్రాంతీయ భాషల్లో నిర్వహించనున్నారు. ఇది తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు ఎంతో ఉపయుక్తంగా మారనుంది. మరోవైపు రాష్ట్రంలోని 13 జిల్లాల అభ్యర్థుల కోసం ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి విశాఖపట్నం మరోసారి వేదిక కానుంది. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఈ రిక్రూట్‌మెంట్ ర్యాలీని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి సంబంధించిన షెడ్యూల్ ఇటీవలే విడుదలైంది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ అంబేడ్కర్, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్ కృష్ణా, మచిలీపట్నం జిల్లాల అభ్యర్థులకు విశాఖలో ఎంపికలు నిర్వహించాలని ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయం నిర్ణయించింది. ఈ ర్యాలీలో పాల్గొనేందుకు ఏప్రిల్ 10వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ ట్రేడ్స్ మెన్ కేటగిరీల కోసం ఈ రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తున్నారు. అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్‌కు 8వ తరగతి, జనరల్ డ్యూటీ కేటగిరీలకు 10వ తరగతి అర్హతగా నిర్ణయించారు. అలాగే 17.5 నుంచి 21 సంవత్సరాల వయసు ఉన్న అభ్యర్థులే అర్హులు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేవారు మాత్రమే ఈ రిక్రూట్‌మెంట్‌కు హాజరు కావాలని అధికారులు స్పష్టం చేశారు.

ఈ ఏడాది కీలక మార్పులు..

ఈ సారి అగ్నివీర్ రిక్రూట్‌మెంట్‌లో పలు ముఖ్యమైన మార్పులు చేశారు. గతంలో అభ్యర్థులు ఒక కేటగిరీకి మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండగా, ఈసారి రెండు కేటగిరీల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే ఎన్‌సీసీ, ఐటీఐ, పాలిటెక్నిక్ డిప్లమో వంటి అదనపు విద్యార్హతలు కలిగిన వారికి బోనస్ మార్కులు లభిస్తాయి. గతంలో హిందీ, ఇంగ్లిష్ భాషల్లో మాత్రమే నిర్వహించిన కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (సీఈఈ)ను ఇప్పుడు తెలుగుతో సహా 13 భాషల్లో రాసుకునేందుకు వీలు కల్పిస్తున్నట్లు ఆర్మీ రిక్రూట్‌మెంట్ బోర్డు వెల్లడించింది. రిక్రూట్‌మెంట్ ర్యాలీకి సంబంధించిన అడ్మిట్ కార్డులను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. అడ్మిట్ కార్డులో ర్యాలీకి హాజరుకావాల్సిన తేదీ, సమయం వంటి వివరాలు ఉంటాయి. అభ్యర్థుల సౌకర్యం కోసం రిక్రూట్‌మెంట్ జరిగే ప్రదేశంలో ప్రత్యేక రిపోర్టింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ పూర్తిగా ఆటోమేటెడ్ విధానంలో పారదర్శకంగా జరుగుతుందని రక్షణ శాఖ తెలిపింది. అభ్యర్థుల సందేహాల నివృత్తి కోసం లైవ్ చాట్ సదుపాయంతో పాటు 'ఆర్మీ కాలింగ్' అనే ఆన్‌లైన్ మొబైల్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. మరింత సమాచారం కోసం www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు లేదా విశాఖపట్నంలోని ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయాన్ని 0891- 2756959, 0891-2754680 నంబర్లకు ఫోన్ చేయాలని అధికారులు సూచించారు.

20 కిలోల గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న టెక్కలి డీఎస్పీ మూర్తి

పాతపట్నం: గంజాయి అక్రమ రవాణాకు సంబంధించి పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసినట్లు టెక్కలి డీఎస్పీ డి.ఎస్.ఆర్.వి.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. ఆదివారం పాతపట్నం సర్కిల్ కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. సారవకోట మండలం అలుదు గ్రామానికి చెందిన సాగిపల్లి పవన్ అలియాస్ రోషన్ పాతపట్నంలో అద్దె ఇంట్లో ఉంటూ పెయింటింగ్ మేస్త్రిగా పనులు చేసేవాడు. గంజాయికి అలవాటు పడ్డాడు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా జాజిపూర్ గ్రామానికి చెందిన అశోక్ కుమార్ పాణిగ్రాహి అలియాస్ సీతారాం వద్దకు వెళ్లి గంజాయి కొనేవాడు. 20.540 కిలోల గంజాయిని రూ.60 వేలు కొనేందుకు ఒప్పందం కుదిర్చుకొని, ఆంధ్ర ప్రాంతంలో అమ్మకాలు చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఈ నెల 15న మధ్యాహ్నం రెండు గంటల సమయంలో అశోక్‌కుమార్ ఒడిశా నుంచి పాతపట్నం మేజర్ పంచాయతీ కాపుగోపాలపురం వైపు నడుచుకుంటూ వస్తు.. సాగిపల్లి పవన్‌కు అందజేసే క్రమంలో పోలీసులు ఇద్దరినీ పట్టుకున్నారు. గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పవన్‌పై గతంలో ఆమదాలవలస, ఎచ్చెర్ల పోలీసుస్టేషన్‌లో కేసులు ఉన్నాయని, అశోక్‌కుమార్‌పై ఇచ్ఛాపురం పోలీసు స్టేషన్‌లో కేసు ఉందని డీఎస్పీ వివరించారు. విలేకరుల సమావేశంలో పాతపట్నం సీఐ వి.రామారావు, ఎస్ఐ బి.లావణ్య పాల్గొన్నారు.

● బ్రిడ్జి కింద ఇరుక్కున్న గ్రానైట్ లారీ



స్థానిక మెళియాపుట్టి రోడ్డులో ఫ్లై ఓవర్ బ్రిడ్జి క్రింద ఆదివారం సాయంత్రం ఓ గ్రానైట్ లారీ ఇరుక్కుంది. దీంతో టెక్కలి నుంచి మెళియాపుట్టి వైపు వెళ్లే వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మెళియాపుట్టి మండలం దీనబంధుపురం నుంచి నిమ్మాడ వైపుగా ఓ లారీపై రెండు గ్రానైట్ బ్లాక్‌లు తీసుకొస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ట్రాఫిక్ స్తంభించడంతో స్థానికుల సహాయంతో లారీని బయటకు తీసే ప్రయత్నం చేశారు. –టెక్కలి రూరల్

డోర్ డెలివరీ చేసేదెప్పుడో?

- పొందూరులో ఇండేన్ గ్యాస్ కస్టమర్లకు తప్పని తిప్పలు
- గ్యాస్ బుక్ చేస్తే క్యాన్సిల్ మెసేజ్‌లు వస్తున్నాయని లబ్ధిదారుల ఆవేదన


తలపై సిలిండర్‌ను మోసుకుంటూ గొడౌన్‌లోకి తీసుకెళ్తున్న మహిళ


ఇండేన్ గ్యాస్ గొడౌన్ వద్దకు వెళ్లి సిలిండర్లను తీసుకెళ్తున్న కస్టమర్లు

పొందూరు:

గత 20 రోజులుగా పొందూరు ఇండేన్ గ్యాస్ కస్టమర్లకు గ్యాస్ కష్టాలు తప్పడం లేదు. డోర్ డెలివరీ జరగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత్యంతరం లేక గొడౌన్‌కు వెళ్లి గ్యాస్ ద్విచక్రవాహనాలపైనే సిలిండర్లను తీసుకెళ్తున్నారు. మరికొందరు సైకిళ్లపై తీవ్ర ప్రయాసలకోర్చుతూ సిలిండర్లను పట్టుకెళ్తున్నారు. ఇంకొందరు మహిళలు ఏకంగా తలపైనే మోసుకెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. ఆటోలను ఆశ్రయిస్తే దూరాన్ని బట్టి రూ.100 నుంచి రూ.200 వరకు అడుగుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రద్దవుతున్న బుకింగ్ ఆర్డర్స్...

ఆటోమేటిక్ రీఫిల్ బుకింగ్ సిస్టమ్‌లో ఇండేన్ గ్యాస్ బుక్ చేసుకున్న వారికి డోర్ డెలివరీ కావడం లేదు. పైగా మీరు బుక్ చేసుకున్న గ్యాస్ కాన్సిల్ అయ్యిందని మెసేజ్‌లు వస్తుండటంతో లబ్ధిదారులు అసహనానికి గురవుతున్నారు. ఎందుకు క్యాన్సిల్ అవుతుందో తెలియక సతమతమవుతున్నారు. పొందూరు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వహణ బాధ్యతలను వజ్రపుకొత్తూరు, రణస్థలం ఏజెన్సీలకు అప్పగించారు. రణస్థలం ఏజెన్సీ ఇప్పటికీ స్పందించలేదు. వజ్రపుకొత్తూరు ఏజెన్సీ మాత్రమే గ్యాస్ సరఫరా చేస్తోంది. గ్యాస్ గొడౌన్ వద్దకు వచ్చిన కస్టమర్లకు మాత్రమే ఈ నెల 11 నుంచి సిలిండర్లు సరఫరా చేస్తున్నారు. రణస్థలం ఏజెన్సీ వారు కూడా గ్యాస్ సరఫరా ప్రారంభిస్తే చాలావరకు సమస్యలు తీరిపోయే అవకాశం ఉంది.



ఏరియా కోడ్ జోడించలేదా..?

గ్యాస్ బుక్ చేసుకొన్న డోర్ డెలివరీ చేయకపోవడం, గ్యాస్ బుకింగ్ కాన్సిల్ అయినట్లు మెసేజ్‌లు వస్తుండటంపై వజ్రపుకొత్తూరు ఏజెన్సీ సిబ్బందిని ప్రశ్నించగా ఏరియా కోడ్ కస్టమర్ ఖాతాలకు అనుసంధానం కాలేదని చెప్పారు. బుక్ చేసుకున్న వారిలో కొందరికి బిల్లు జనరేట్ కావడం లేదన్నారు. గొడౌన్‌కు వచ్చి గ్యాస్ తీసుకున్న వారికి ఆటోమేటిక్‌గా క్యాన్సిల్ అవుతున్నాయని తెలిపారు. గ్యాస్ బుక్ చేసి పది రోజులు దాటిన వారివి కూడా క్యాన్సిల్ చేయాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పారు. లేదంటే కస్టమర్ ఖాతా బ్లాక్ అవుతుందని తెలిపారు. మరో రెండు రోజుల్లోగా ఏరియా కోడ్ సర్దుబాటు జరుగుతుందని, తమ వజ్రపుకొత్తూరు కోడ్‌లో కనిపిస్తాయని ఆ రోజు నుంచి డోర్ డెలివరీ జరుగుతుందని పేర్కొన్నారు.

ఉదయం 10 గంటలకే గ్రీవెన్స్

శ్రీకాకుళంపాతబస్టాండ్: జిల్లా యంత్రాంగం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ సెల్ సమయాన్ని మార్చారు. ఇకపై ప్రతి సోమవారం ఉదయం 10 గంటలకే గ్రీవెన్స్ సెల్ ప్రారంభమవుతుందని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆదిత్యుని సన్నిధిలో ప్రత్యేక పూజలు


అన్నదాన ప్రసాదానికి బారులు తీరిన భక్తులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక ఆదివారం కావడంతో ఇతర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఆదిత్యునికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ కనకరాజు ఆధ్వర్యంలో భక్తులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో భక్తులకు ఉచితంగా స్థానిక నేతలు ఉంగటి రమణమూర్తి, ఉంగటి పాపారావు సోదరులు ఉచితంగా మజ్జిగ, మంచినీటిని పంపిణీ చేశారు. ఇక ఒక్కరోజులో వివిధ దర్శనాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.3,82,400, విరాళాలు, ప్రత్యేక పూజల ద్వారా రూ.73,523, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ. 1,45 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా సూపరింటెండెంట్ ఎస్.కనకరాజు తెలియజేశారు.